పోస్టు పెడితే.. అరెస్టు చేసుడేంది?!

బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొని మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఇండ్ల జోలికెళ్లి రేవంత్ డకౌట్

- **అమరవీరులు, వారి కుటుంబాల గురించి ఆలోచించే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటే**
- **తెలంగాణ అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నీ బహుమతుల ప్రదానంలో హరీశ్**

తుర్కయాంజాల్, నవంబర్ 18 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి అన్నీ తుగ్లక్ పనులని, ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టగానే హైదరాబాద్ లాంటి కాస్మోపాలిటన్ సిటీలో రాత్రి 10 గంటలకే దుకాణాలు బంద్ అని, గచ్చిబౌలి-ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు రద్దు అని, ఫార్మాసిటీ రద్దు అని జోకులు చేస్తున్నాడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. అవగాహన లేని మాటలు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీస్తున్నాడని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ జేబీ క్రికెట్ గ్రౌండ్‌లో తెలంగాణ అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నీ (తెలంగాణ చాంపియన్స్ ట్రోఫీ) బహుమతుల ప్రదానోత్సవాన్ని సోమవారం నిర్వహించగా హరీశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ అమరవీరుల గురించి ఆలోచించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగంతోపాటు రూ.10 లక్షల చొప్పున అందజేసి గౌరవించామని గుర్తుచేశారు. అమరుల త్యాగఫలితం, విద్యార్థుల పోరాటం, కేసీఆర్ కృషితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని పునరుద్ఘాటించారు. గడిచిన పదేండ్లలో రాష్ట్రాన్ని కేసీఆర్ అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపితే రేవంత్‌రెడ్డి 11 నెలల్లోనే పదేండ్లు వెనక్కి తీసుకెళ్లాడని విమర్శించారు.

రాజకీయాల్లో హత్యలుండవు..

రాజకీయాలకు, క్రికెట్‌కు దగ్గరి సంబంధం ఉన్నదని.. రాజకీయాల్లో హత్యలుండవని.. క్రికెట్‌లో హిట్ వికెట్ మాదిరిగా రాజకీయ ఆత్మహత్యలు ఉంటాయని హరీశ్ పేర్కొన్నారు. పేదల ఇండ్లు కూలగొట్టడమంటేనే రేవంత్‌రెడ్డి హిట్‌వికెట్ అయినట్టని, పేదల ఇండ్ల జోలికెళ్లి రేవంత్ డకౌట్ అయ్యాడని ఎద్దేవాచేశారు. రూ.3800 కోట్లతో మూసీ అభివృద్ధిని ప్రారంభించింది కేసీఆర్ అని గుర్తుచేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మూసీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉండి పేదల ఇండ్ల జోలికి పోకుండా మురుగునీరు మూసీలోకి రాకుండా రూ.3800 కోట్లతో 31 ఎస్టీపీల నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రూ.1100 కోట్లతో గోదావరి నీళ్లను మూసీలోకి తీసుకొచ్చి పారించాలని బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తే.. రేవంత్‌రెడ్డి గోదావరి నీళ్లు తెచ్చుడు, ఎస్టీపీలను బంద్‌పెట్టి పేదల ఇండ్లను కూలగొడుతున్నాడని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 11 నెలలు గడుస్తున్నా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు చేయలేదని హరీశ్ ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలను చదువుకు దూరం చేసే కుట్రతోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు.

8శాతం కమీషన్ల ప్రభుత్వం

ప్రస్తుతం రాష్ట్రంలో బిల్లులు మంజూరు కావాలంటే 8 శాతం కమీషన్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉన్నదని హరీశ్ చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చారని, ఎన్నో ఐటీ కంపెనీలను తీసుకొచ్చి ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. అనంతరం టోర్నీలో విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు మాధవరం నరసింహారావును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు, నాయకులు విప్లవ్, రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

- **ఇది భావప్రకటన స్వేచ్ఛను హరించినట్టే లెక్క**
- **ఐటీ చట్టంలోని సెక్షన్-66(ఏ)ను తోసిపుచ్చుతూ.. తొమ్మిదేండ్ల కిందట సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు**
- **బీఆర్ఎస్ నేత కొణతం దిలీప్ అరెస్ట్ నేపథ్యంలో చర్చ**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): నేటి సమాచార యుగంలో.. సమాచార మాధ్యమాల ద్వారా నచ్చిన అంశంపై మాట్లాడే భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న ఐటీ చట్టం-2000లోని సెక్షన్-66(ఏ)ను సుప్రీంకోర్టు అత్యున్నత ధర్మాసనం చాపచుట్టి పక్కనబెట్టింది. ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల్లో, వెబ్‌సైట్లలో అభ్యంతరకర పోస్టులు చేశారన్న నెపంతో వ్యక్తులను ఏకపక్షంగా అరెస్టు చేయడానికి వీలు కల్పించే సైబర్ చట్టంలోని అంశాలను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఈ మేరకు 2015 మార్చి 24న జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం 123 పేజీల చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. కాగా, తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు కొణతం దిలీప్ అరెస్టు నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

తీర్పు సందర్భంగా ధర్మాసనం చేసిన కీలక వ్యాఖ్యలు

- వాక్ స్వాతంత్ర్యం అనేది దేశంలోని పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు.
- నేటి యుగంలో సమాచార మాధ్యమాల ద్వారానే కోట్లాది పౌరులు తమ అభిప్రాయాలను పంచుకొంటున్నారు. ఇందుకు సోషల్‌మీడియా వేదికలు, వెబ్‌సైట్లు, ఈ-మెయిల్‌లను వాడుతున్నారు.
- పౌరుల ఆలోచనా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ అనే హక్కులకు ఐటీ చట్టంలోని సెక్షన్ 66(ఏ) ఒకవిధంగా అడ్డంకిగా మారింది.
- రాజ్యాంగం ప్రసాదించిన వాక్‌స్వాతంత్ర్యం అనే ప్రాథమిక హక్కుకు ఈ సెక్షన్ ప్రత్యక్షంగానే భంగం కలిగిస్తున్నది.
- తీవ్ర ప్రమాదకర వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయవచ్చని ఐటీ చట్టంలోని సెక్షన్ 66(ఏ) చెప్తున్నది.
- మా ప్రశ్నేంటంటే, ఒక వ్యక్తి చేసి న వ్యాఖ్యలు తీవ్ర ప్రమాదకరమైనవా? లేదా అభ్యంతరకరమైనవా? లేదా దురుద్దేశపూరితమైనవా? ఎవరు నిర్ణయించాలి?
- సోషల్‌మీడియాలో వ్యాఖ్యలు చేసిన ఓ వ్యక్తి తప్పు చేశాడని పోలీసులే ముందుగా ఎలా నిర్ణయిస్తారు. అంటే వాళ్లకు వాళ్లే తీర్పునిస్తారా? కేసులు పెట్టేస్తారా?
- సోషల్‌మీడియాలో చేసిన పోస్టులను బట్టి అరెస్టులు చేయడం కరెక్ట్ కాదు. మనసుకు నచ్చిన అభిప్రాయాలను వెల్లడించే హక్కును ఇది కాలరాయడమే.
- సెక్షన్ 66(ఏ)లోనే రెచ్చగొట్టే, ఇబ్బంది పెట్టే, తీవ్ర ప్రమాదకరమైన.. అంటూ పలు పదబంధాలున్నాయి. ఏ కామెంట్‌ను ఏ క్యాటగిరీలోకి నిర్ణయిస్తారు?
- ఒక వ్యక్తి చేసిన కామెంట్ ఎలాంటి నేరం కిందకు వస్తుందో అటు పోలీసులు, ఇటు పోస్టు చేసిన వారూ గుర్తించడం కష్టం. అలాంటప్పుడు.. ఆ వ్యక్తిపై పోలీసులు కేసు ఎలా పెడతారు?
- సుశిక్షితులైన న్యాయకోవిదులు కూడా ఒకే అంశంపై భిన్నమైన తీర్పులు ఇవ్వడాన్ని చూస్తుంటాం. అలాంటిది ఏది నేరమో.. ఏది తీవ్ర నేరమో.. ఏది కాదో.. ఇతరులు (పోలీసులు) ఎలా నిర్ణయించగలరు?
- ఒక వ్యాఖ్య ప్రమాదకరమా? అత్యంత ప్రమాదకరమా? అనే దానిపై న్యాయకోవిదులు మాత్రమే నిర్ధారణకు రాగలరు.
- ఇంటర్నెట్‌లో, సోషల్‌మీడియాలో చేసిన వ్యాఖ్యలను శాంతిభద్రతలతో ముడిపెట్టడం తగదు.
- సోషల్‌మీడియాలో చేసిన కామెంట్లతో పరువు నష్టానికి పాల్పడ్డారని, నేరం చేసేలా ప్రేరేపించారనేందుకు గానీ అవసరమైన అంశాలేవీ సెక్షన్ 66(ఏ)లో లేవు.
- లిఖితపూర్వక వ్యాఖ్యలు, సోషల్‌మీడియాలో కామెంట్లు ఒక దృక్కోణంతో వ్యక్తంచేసే అభిప్రాయాలే. ఈ వ్యాఖ్యలను బట్టి నేరం చేశారంటూ కేసులు నమోదు చేయడం సహేతుకం కాదు.
- (సెక్షన్ 66(ఏ)ను దుర్వినియోగం చేయబోమన్న అప్పటి ఎన్డీయే సర్కారును ఉద్దేశిస్తూ..) 'ప్రభుత్వాలు మారుతాయి. చట్టం మాత్రం శాశ్వతం. రాబోయే ప్రభుత్వం ఈ సెక్షన్‌ను దుర్వినియోగం చేయబోదని వారి తరఫున మీరెలా (కేంద్రం) పూచీ పడతారు?' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో సెక్షన్ 66(ఏ)ను కొట్టేస్తున్నట్టు ప్రకటించింది.

ఏమిటీ కేసు?

శివసేన అగ్రనేత బాల్‌ఠాక్రే మృతికి నిరసనగా 19 నవంబర్ 2012లో ముంబైలో బంద్ పాటించారు. దీనిని షహీన్ బాధ్దా అనే యువతి సోషల్‌మీడియాలో ప్రశ్నించింది. ఈ కామెంట్‌కు రీణు శ్రీనివాసన్ అనే మరో యువతి లైక్ కొట్టింది. దీంతో థానే పోలీసులు ఈ ఇద్దరినీ అరెస్టు చేశారు. వీళ్ల అరెస్ట్‌ను సవాల్ చేస్తూ శ్రేయా సింఘాల్ అనే లా విద్యార్థిని పిల్ దాఖలు చేశారు. ఎస్పీ నేత అజంఖాన్‌పై ఫేస్‌బుక్‌లో అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిందంటూ ఓ విద్యార్థినిని యూపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా దేశవ్యాప్తంగా కేసులు పెరుగుతుండటంతో చివరకు సుప్రీంకోర్టు ఐటీ చట్టంలోని సెక్షన్-66(ఏ)ను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

ఆగని అరెస్టులు

ఐటీ చట్టంలోని సెక్షన్ 66(ఏ)ను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ, నెటిజన్లపై కేసుల నమోదు మాత్రం ఆగలేదు. దీంతో ఈ విషయంపై 2021లో సుప్రీంకోర్టు మరోమారు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. 'ఇక మీదట రాష్ట్రాలు, యూటీల్లో ఏ పోలీసు స్టేషన్‌లోనూ సెక్షన్ 66(ఏ) కింద కేసులు నమోదు చేయవద్దు' అంటూ కేంద్రహోంశాఖ వెంటనే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సెక్షన్ కింద నమోదు చేసిన కేసులనూ ఉపసంహరించాలని ఆదేశించింది.

ఏమిటీ సెక్షన్ 66(ఏ)

దురుద్దేశంతో ఇతరులకు హాని కలిగించేలా అభ్యంతరకరంగా, అసౌకర్యం కలిగించేలా నెట్టింట వ్యాఖ్యలు చేయడం లేదా సమాచారాన్ని చేరవేయడాన్ని నేరంగా పరిగణిస్తారని ఐటీ చట్టంలోని సెక్షన్ 66(ఏ) చెప్తున్నది. దీనికి గరిష్ఠంగా మూడేండ్ల జైలు శిక్ష విధించవచ్చని పేర్కొన్నది. అయితే, ఈ సెక్షన్‌ను సుప్రీంకోర్టు తప్పుబడుతూ రద్దు చేసింది. ఈ సెక్షన్ భావప్రకటనను హరించడమేనని తేల్చి చెప్పింది.

తప్పో.. ఒప్పో పోలీసులెలా నిర్ణయిస్తారు?

ఒకరికి తప్పుగా కనిపించిన విషయం.. మరొకరికి తప్పుగా కనిపించకపోవచ్చు. ఇలాంటి సమయంలో సోషల్‌మీడియాలో కామెంట్ చేశాడని ఒక వ్యక్తిపై కేసు ఎలా నమోదు చేస్తారు. ఒక విషయం తప్పా? ఒప్పా? అనేది పోలీసులు ఎలా నిర్ణయించగలరు? మనసుకు నచ్చింది కూడా చెప్పే హక్కు కూడా పౌరులకు ఉండకూడదా? ఐటీ చట్టంలోని సెక్షన్-66(ఏ) భావప్రకటన స్వేచ్ఛను హరించేలా ఉన్నది. అందుకే దానిని తోసిపుచ్చుతున్నాం.

– జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ నారీమన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం (24.03.2015)

కొణతం దిలీప్ రిమాండ్ తిరస్కరణ

- **అక్రమ కేసులు బనాయించి.. రిమాండ్ కోసం కొత్త సెక్షన్ల జమ**
- **తిరస్కరించిన న్యాయస్థానం**

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నాడని ఆరోపిస్తూ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌పై అక్రమ కేసులు బనాయించి హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ప్రభుత్వాన్ని అవమానపరిచేలా కామెంట్లు పోస్టు చేశారని ఆదర్శనగర్‌కు చెందిన సంజీవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు క్రైం నంబర్ 2317/2024తో 67 ఐటీ యాక్ట్ 2008, బీఎన్ఎస్ కింద 353(1)(బీ), 353(2), 352, 193,196 సెక్షన్ల కింద, సెప్టెంబర్ 28న కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్లలో గరిష్ఠంగా ఐదేండ్ల కంటే ఎక్కువ శిక్షలు లేవు. ఈ సెక్షన్లతో వెళ్తే కోర్టు రిమాండ్‌ను తిరస్కరిస్తూ, 41 సీఆర్‌పీసీ నోటీసులు ఇవ్వాలని సూచించే అవకాశాలుండడంతో పోలీసులు కొత్తగా 336(4) ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్స్ ఫోర్జరీ, 61(2)(ఎ) కుట్ర, 111(బీ) అర్గనైజ్డ్ క్రైమ్‌ల కింద వచ్చే సెక్షన్లను జోడించారు. నేరం రుజువైతే ఫోర్జరీకి అత్యధికంగా ఏడేండ్లు, కుట్ర కేసులో ఉరి శిక్ష, జీవితఖైదు పడే అవకాశాలు ఉంటాయి. నాంపల్లి కోర్టులో దిలీప్‌కు రిమాండ్ విధించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఇది కుట్ర అని ఉద్దేశపూర్వకంగా జైలుకు తరలించేందుకు ప్లాన్ చేస్తున్నారని, గత కేసుపై స్టే ఉన్నా అరెస్ట్ చేశారని దిలీప్ తరఫు న్యాయవాదులు వాదించడంతో న్యాయస్థానం దిలీప్ రిమాండ్‌ను తిరస్కరిస్తూ, 41 సీఆర్‌పీసీ నోటీసులిచ్చి పంపాలని సూచించింది.

నినదిస్తున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్

ఎన్ని కేసులు పెట్టినా ఇట్లే పోరాడుతా!

- **ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అక్రమ కేసులు**
- **బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్**

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అక్రమ కేసులు బనాయించి పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ హైకోర్టు స్పష్టంగా తనకు రిలీఫ్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినా పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. నాంపల్లి కోర్టు ప్రాంగణంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంపై కేసులు నమోదు చేయడమే తప్పనీ, వరుసగా కేసులు నమోదు చేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా తనను నిర్బంధంలోకి తీసుకున్నారని తెలిపారు. 'నా మీద పెట్టిన ఏ ఆరోపణలను నేను ఒప్పుకోవట్లేదు. నేనేమీ నేరం చేయలేదు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే కేసులు పెడుతున్నారు అని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా ఇట్లే పోరాడుతా' అని తేల్చిచెప్పారు. పోలీసులు బలవంతంగా వాహనంలోకి ఎత్తుకెళ్తున్న సమయంలో జై తెలంగాణ అంటూ నినాదం చేస్తూ వాహనంలో కూర్చున్నారు.

ప్రశ్నిస్తే సంకెళ్లా..? నిలదీస్తే అరెస్టులా?

ఇందిరమ్మ రాజ్యమంటే ఎమర్జెన్సీ రోజులేనా: కేటీఆర్

బీఆర్ఎస్ సోషల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్‌ను సీసీఎస్ విచారణ కోసం పిలిపించి అరెస్ట్ చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నాడనే కక్షతోనే అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్బంధ పాలనతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. నిర్బంధాలు ప్రజాగొంతుకలను అణచివేయలేవని హెచ్చరించారు.

కక్షపూరిత ధోరణి మానుకోవాలి: హరీశ్‌రావు

ప్రశ్నించేవారిని ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సోషల్ మీడియాలో నిలదీస్తే కక్ష సాధిస్తున్నదని, ఇది ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం మంచిదికాదని హితవు పలికారు. ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామికంగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా డైరెక్టర్ దిలీప్ అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నామని చెప్పారు.

ఎంతకాలం నిర్బంధాలు..?: పల్లా

బీఆర్ఎస్ సోషల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ అక్రమ అరెస్ట్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఖండించారు. విచారణ పేరిట పదే పదే అదుపులోకి తీసుకోవడం సిగ్గుచేటని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు ఏడాది కాలంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం ఇంకా ఎంతకాలం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన..: తాతా మధు

బీఆర్ఎస్ సోషల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికమని ఎమ్మెల్సీ తాతా మధు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు సైబర్‌క్రైమ్ ఠాణాకు వచ్చిన ఆయనను అదుపులోకి తీసుకోవడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని చెప్పారు. రేవంత్‌రెడ్డి రాక్షస పాలన చేస్తున్నారని మండిపడ్డారు. సర్కారుకు ఊడిగం చేస్తూ ప్రజాగొంతులను అణచివేస్తున్న పోలీసులకు భవిష్యత్‌లో శిక్ష తప్పదని హెచ్చరించారు.

గొంతు నొక్కడమే ఇందిరమ్మ పాలనా?: వేముల

ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తున్న వారి గొంతు నొక్కడమే ఇందిరమ్మ పాలనా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నిలదీశారు. నిరసనలు తెలుపుకొనేందుకు అవకాశమిస్తామని చెప్పి అక్రమ అరెస్ట్‌లకు పూనుకుంటున్నదని, ఓ కేసులో విచారణకు పిలిచి బీఆర్ఎస్ సోషల్ మీడియా డైరెక్టర్ దిలీప్‌ను దుర్మార్గంగా నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ఉద్యమకారులకు అరెస్ట్‌లు కొత్తకాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని తెలిపారు.

సోషల్ మీడియాను చూసి సర్కారు వణుకుతున్నది: నిరంజన్‌రెడ్డి



సోషల్ మీడియాను చూసి రేవంత్ సర్కారు వణికిపోతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆరు గ్యారెంటీల హామీలు అమలు చేతగాకే ఉద్యమకారులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని మండిపడ్డారు. కొణతం దిలీప్‌ను విచారణ పేరిట పిలిచి అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమని తెలిపారు.

పాలన చేతగాకే నిర్బంధాలు: కర్నె

పాలన చేతగాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేకే రేవంత్ సర్కారు ప్రశ్నిస్తున్న వారిని వేధిస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. కొణతం దిలీప్‌పై అక్రమ కేసులు పెట్టి నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. ఆయన చేత తప్పుడు స్టేట్‌మెంట్ ఇప్పించి కేసుల్లో ఇరికించేందుకు కుట్రలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని హితవుపలికారు.

కేసులు పెట్టినా ప్రశ్నించడం ఆపేదిలేదు: సతీశ్‌రెడ్డి

తప్పులు ఎత్తిచూపినందుకే రేవంత్ సర్కారు బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై కక్ష సాధింపునకు దిగుతున్నదని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. పదకొండు నెలల్లో వందకుపైగా అక్రమ కేసులు పెట్టింటిందని గుర్తుచేశారు. విచారణకు వెళ్లిన దిలీప్‌ను అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. అక్రమ కేసులకు భయపడబోమని, అడుగడుగునా ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు.

వైఫల్యాలను ఎత్తిచూపినందుకే: దేవీప్రసాద్

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేశారని ఉద్యోగ సంఘాల మాజీ నేత దేవీప్రసాద్ పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవించి, విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయనను అక్రమంగా అదుపులోకి తీసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో ప్రశ్నించే వారి గొంతు నొక్కాలనుకోవడం అమానుషమని, సర్కారు దుర్మార్గపు చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

దిలీప్ అరెస్ట్ అక్రమం: ఘంటా చక్రపాణి

ఉద్యమకారుడు కొణతం దిలీప్ అరెస్ట్ చేయడం అక్రమం..అప్రజాస్వామికమని టీజీపీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. ప్రభుత్వాలు విమర్శలను సానుకూలంగా తీసుకోవాలని, అప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లుతుందని చెప్పారు. విమర్శలను సహించలేని వారు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టలేరని తెలిపారు.

సర్కారుకు ఎదురుదెబ్బ

మొదటిపేజీ తరువాయి...

తీసుకున్నామని చెప్పారు. ఇందుకు ఆధారాలు చూపెట్టాలని బీఆర్ఎస్ నేతలు పట్టుబట్టడంతో.. చేసేది లేక అర్ధరాత్రి దిలీప్‌ను విడిచిపెట్టారు. ఒక రోజంతా హైడ్రామా జరిగింది. సోమవారం కూడా ఇదే సీన్ రిపీట్ అయింది. పోలీసులు విచారణకు పిలిచినప్పుడు సహకరించాలని దిలీప్‌కు గతంలో హైకోర్టు సూచించింది. పోలీసులు సోమవారం విచారణకు పిలవగా, ఆయన సీసీఎస్ పోలీసుల ముందు హాజరయ్యారు. దాదాపు రెండుమూడు గంటలపాటు ఖాళీగా కూర్చోబెట్టారని, ఆ తర్వాత పాత కేసులో అరెస్ట్ చేస్తున్నామని చెప్పారు. అయితే ఈ కుట్రను గుర్తించిన న్యాయస్థానం.. దిలీప్ రిమాండ్‌ను తిరస్కరించింది. దీంతో ప్రభుత్వానికి ముచ్చటగా మూడోసారి ఎదురుదెబ్బ తగిలింది.

పైనుంచి ఆదేశాలతోనే...

ప్రభుత్వ అసమర్థతను, పాలనా విధానాలను ప్రజలకు చేరవేస్తున్న కొణతం దిలీప్‌ను సోషల్ మీడియా నుంచి కొన్నాళ్లపాటు దూరం చేయాలని ప్రభుత్వ పెద్దలు మొదటి నుంచీ ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఎలాగైనా అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించినట్టు చర్చ జరుగుతున్నది. పై నుంచి వస్తున్న ఒత్తిడితో ఇప్పటికి మూడుసార్లు పోలీసులు కొణతం దిలీప్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్‌కు ప్రయత్నించారు. కానీ న్యాయస్థానంలో వారికి ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా సోమవారం రిమాండ్ రిపోర్ట్ రిజెక్ట్ కావడంతో ప్రభుత్వ పెద్దల అహం దెబ్బతిన్నట్టు చర్చ జరుగుతున్నది. అంత సులభంగా ఎలా వదిలిపెట్టారని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎలాగైనా సరే కొత్త కేసులు నమోదు చేయాలని, కచ్చితంగా అరెస్ట్ చేయాలని హుకూం జారీ చేసినట్టు చెప్పుకుంటున్నారు. అయితే.. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసులు ఎలా నమోదు చేస్తామని, అవి న్యాయస్థానాల ముందు ఎలా నిలబడుతాయని పోలీసులు అసహనం వ్యక్తం చేస్తున్నారట.

ఇలాంటి ధోరణి మంచిది కాదు: కే శ్రీనివాస్

తెలంగాణ ఉద్యమకారుడు దిలీప్ అరెస్ట్ అన్యాయం. ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కే శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇది ప్రజాపాలనా కాదని, దుర్మార్గపు పాలన అని విమర్శించారు.

కేసులు, నిర్బంధాలు కొత్తకాదు: చిరుమల్ల రాకేశ్

బీఆర్ఎస్‌కు కేసులు, నిర్బంధాలు కొత్తకాదని టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేశ్ తెలిపారు. తెలంగాణ కోసం అనేకసార్లు జైలుకు వెళ్లిన విషయాన్నిన గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో రాజ్యాంగ విరుద్ధంగా పాలన సాగిస్తున్నదని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. విచారణ కోసం రమ్మని కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ దోపిడీ పాలనను అంతం చేసేదాకా పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు.

సోషల్ మీడియా వారియర్లపై సర్కార్ వార్!

- **ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న సోషల్ మీడియా**
- **పాలనలో లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకం**
- **ఇప్పటికే ప్రభుత్వ నియంత్రణలోకి ప్రధాన మీడియా సంస్థలు**
- **కొరకరాని కొయ్యగా మారిన సోషల్ మీడియా**

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, పాలనలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న సోషల్ మీడియా వారియర్లపై కాంగ్రెస్ సర్కార్ యుద్ధం మొదలుపెట్టింది. తమకు కొరకరాని కొయ్యగా మారిన సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. సోషల్ మీడియా వారియర్లను బెదిరించేందుకు అరెస్టుల పర్వాన్ని తెరమీదికి తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో కొన్ని నెలలుగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. దీనిని సోషల్ మీడియా ఎత్తిచూపుతున్నది. ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నాయకులు చేస్తున్న కుట్రలను, అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తున్నది. వీటిపై ప్రజలు సైతం అదే స్థాయిలో స్పందిస్తున్నారు. ఈ పరిణామాలు ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. నమస్తే తెలంగాణ, టీ న్యూస్, సాక్షి వంటి కొన్ని మీడియా సంస్థలు తప్ప మిగతా ప్రధాన పత్రికలు, టీవీలన్నీ ప్రభుత్వం నియంత్రణలోకి వెళ్లిపోయాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ప్రభుత్వం వివిధ మార్గాలు అనుసరించిందని చెప్పుకుంటున్నారు. కానీ సోషల్ మీడియా మాత్రం కొరకరాని కొయ్యగా మారిపోయింది. దానిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం నానా అవస్థలు పడుతున్నది. ధీటుగా అధికార పార్టీ సోషల్ మీడియాలో వెనుకబడిపోయిందని స్వయంగా పలువురు మంత్రులు బహిరంగంగానే అసహనం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ సోషల్ మీడియా ఇన్‌చార్జి సైతం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరిగింది. ప్రభుత్వ అసమర్థతను ఎలా కప్పిపుచ్చుకోవాలో, ఎలా కౌంటర్ చేయాలో తెలియక కాంగ్రెస్ సోషల్ మీడియా చేతులెత్తేసినట్టు చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వ్యతిరేక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లకుండా సోషల్ మీడియా వారియర్లను భయపెట్టాలని నిర్ణయించుకున్నట్టు చర్చ జరుగుతున్నది. ఇందులో భాగంగానే కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేశారని అంటున్నారు.

అరెస్ట్.. డైవర్షన్ డ్రామా

తెలంగాణ ఉద్యమకారుడు కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేయడం వెనుక మరో కారణం కూడా ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. లగచర్లకు చెందిన బాధితులు సోమవారం ఢిల్లీలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్లు, మానవ హక్కులు, మహిళా హక్కుల కమిషన్లను కలిశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వ చర్యలను ఎండగట్టారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి వరుసగా అదే సమయానికి మంత్రులతో ప్రెస్‌మీట్ నిర్వహించారు. వాస్తవానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో కొత్తగా చెప్పిన వివరాలేమీ లేవు. ఆదివారం ప్రభుత్వం ఒక నోట్‌లో విడుదల చేసిన సర్వే గణాంకాలను చదివి వెళ్లిపోయారు. దీంతోపాటు సోషల్ మీడియా వారియర్ల దృష్టిని మరల్చేందుకు కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేశారని విమర్శిస్తున్నారు. తద్వారా ప్రధానమీడియాలో, సోషల్ మీడియాలో చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నమని చెప్తున్నారు.